క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో స్వామి వారు

అడ్డతీగల: మండలంలోని అనిగేరు రోడ్డు వద్ద పార్వతీ సమేత నాగలింగేశ్వర క్షేత్రంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ కన్వీనర్ సామిదాల రాజారమేష్ తెలిపారు. ప్రతి శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజాధికాలు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని జరుపుతామన్నారు. భక్తుల భాగస్వామ్యంతో నిత్య పూజలు చేపట్టనున్నట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు.

గులాబీ మొక్కలకు గిరాకీ


గులాబీ మొక్కలు కొనుగోలు చేస్తున్న మహిళలు

డుంబ్రిగుడ: మండలంలోని శుక్రవారం అరకు వారపు సంతలో రాజమండ్రి నుంచి తీసుకు వచ్చి గులాబీ మొక్క లు జోరుగా అమ్మకాలు జరిగాయి. గిరిజన మహిళలు ఎక్కువ మొత్తంలో గులాబీ మొక్కలను కొనుగోలు చేసినట్టు వ్యాపారులు చెప్పారు. ఒక్కో మొక్క రూ.100లకు విక్రయించామని, గిట్టుబాటు ధర లభించిందన్నారు. రాజమండ్రి గులాబీ మన్యంలో డిమాండ్ ఉందని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలో అల్లూరి విగ్రహం


అల్లూరి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సత్యానందం, ఉపాధ్యాయులు

కొయ్యూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని శుక్రవారం ఏర్పాటుచేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి సత్యానందం విగ్రహాన్ని సమకూర్చగా, లక్కాకుల బాబ్జీ అందజేశారు. ఈ సందర్భంగా సత్యానందం మాట్లాడుతూ పాఠశాలపై ఉన్న అభిమానంతో ఇక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ వంతు సాయం చేయాలని కోరారు. సర్పంచ్ బాలరాజు, హెచ్‌ఎం టి.రామారావు, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ శివరామరాజు, దొరబాబు, బుర్గులయ్య పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు


మాట్లాడుతున్న కేజీబీవీ ప్రత్యేకాధికారి జయప్రద

హుకుంపేట: మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు సభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యాలయం ప్రత్యేకాధికారి జయప్రద మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు భయం వదిలి ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు. పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. సిబ్బంది హసీనా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం


సత్యవతి

హుకుంపేట: సచివాలయం మహిళా పోలీసుల సంక్షేమ జిల్లా కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. మహిళ పోలీసుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో జిల్లా అధ్యక్షురాలిగా పూజరి సత్యవతి, ప్రధాన కార్యదర్శిగా రమ్యకుమారి, ఉపాధ్యక్షులుగా సుబ్బలక్ష్మి, గీతాంజలి సభ్యులను ఎన్నుకున్నారు. పలువురు మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తామన్నారు.

ఆశాజనకంగా లాభాలు

- మన్యంలో విస్తారంగా చింతపండు దిగుబడులు
- జోరందుకున్న అమ్మకాలు
- కిలో రూ.32.40కి జీసీసీ కొనుగోలు


విరగ్గాసిన చింతచెట్టు


అమ్మకానికి తీసుకొచ్చిన చింతపండు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో చింతపండు దిగుబడులు ప్రారంభమవ్వడంతో గిరిజన రైతులు అమ్మకాలతో బిజీగా మారారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో చింతచెట్లకు ఈ ఏడాది కాపు ఆశాజనకంగానే ఉంది.. ప్రస్తుతం పంట దిగుబడి దశకు చేరుకోవడంతో గిరిజన రైతులు చింతచెట్లకు బొట్టలను నేలరాల్చి వాటిలో చింతపండును సేకరించి వెనువెంటనే అమ్మకాలను ప్రారంభిస్తున్నారు. గిరిజన సహకార సంస్థ కూడా చింతపండును ఈ ఏడాది కూడా భారీగానే కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసింది. గత ఏడాది అనుగుణంగా కిలో రూ.32.40పైసల ధరతో కిలో చింతపండును కొనుగోలు చేయాలని జీసీసీ యాజమాన్యం నిర్ణయించింది. గత ఏడాది చింతపల్లి, పాడేరు డివిజన్ల పరిధిలో సుమారు 100 టన్నుల వరకు జీసీసీ చింతపండును కొనుగోలు చేసింది. ప్రైవేటు వ్యాపారులు కూడా పోటీపడి చింతపండును కొనుగోలు చేస్తున్నారు. శుక్రవారం పాడేరు,అరకు సంతలకు గిరిజన రైతులు చింతపండును భారీగానే తీసుకువచ్చి అమ్మకాలు జరిపారు.10 కిలోల బరువు తూగే బుట్ట చింతపండును స్థానిక ప్రజలు, వ్యాపారులు రూ 400 ధరతో కొనుగోలు చేశారు. పాడేరు మండలం వంట్లమామిడి, దేవాపురం, సలుగు, ఐనాడ పంచాయతీలకు చెందిన గిరిజనులు వి.మాడుగుల, వంట్లమామిడి సంతల్లో చింతపండు అమ్మకాలను గత రెండు వారాల నుంచి చేపడుతున్నారు. జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, చింతపల్లి, అనంతగిరి మండలాల్లోను చింతపండును అమ్మకాలను గిరిజన రైతులు ప్రారంభించారు.

నాణ్యమైన తూకంతో కొనుగోలు



గిరిజన సహకార సంస్థ అన్ని వారపు సంతల్లోను చింతపండును నాణ్యమైన తూకంతో కొను గోలు చేస్తోంది. కిలో రూ.32.40 పైసల మద్దతు ధరను అమలుజేస్తున్నాం. దళారీ వ్యాపారుల మోసాలకు గురికాకుండా జీసీసీకే చింతపండును గిరిజన రైతులు అమ్ముకుని మంచి లాభాలు పొందాలి.
– కురుసా పార్వతమ్మ, జీసీసీ డీఎం, పాడేరు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటలక్ష్మి


రన్నర్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎంపీపీ మురళి

రంపచోడవరం: మండలంలోని పెదగెద్దాడలో జరిగిన అనంత చక్రరావు, మంగతాయారు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. టోర్నీలో 64 జట్టు పాల్గొనగా, దేవీపట్నం పవన్ లెవన్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.20వేల నగదు, ట్రోఫీను జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి అందజేశారు. పోటీలో రన్నర్‌గా నిలిచిన రంపచోడవరం పండు లెవెన్ జట్టుకు రూ.10వేలు, ట్రోఫీను ఎంపీపీ ఎంపీపీ కుంజం మురళి అందజేశారు. వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. బెస్ట్ బౌలర్‌గా భగవాన్‌కు, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచిన సాయి, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ సుబ్బకు నగదు ప్రోత్సాహాన్ని వైస్ ఎంపీపీ పండా కుమారి, ఉప సర్పంచ్ కన్నబాబు, జగదీష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామన్నదొర, కార్యకర్తలు, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ కారుకోడి పూజలు , సర్పంచ్‌లు ప్రసాద్‌బాబు, బొజ్జయ్య, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రమేష్, స్వామిదొర, రామకృష్ణ, రత్నరాజులు అందజేశారు. టోర్నీ జరిగిన 22 రోజులపాటు క్రీడాకారులకు భోజన సదుపాయాన్ని సర్పంచ్ వడగల ప్రసాద్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నందూరి రాంబాబు, కూల్‌డ్రింక్స్‌ను నాయకుడు రమణ సమకూర్చారు. టోర్నమెంట్ నిర్వహణకు పెద్దగెద్దాడ యూత్ సహకారం అందించింది.

నేడు గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం

అడ్డతీగల: మండలంలోని తుంగమడుగుల, తిమ్మాపురం ప్రాంతాల్లోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సమావేశాలు నిర్వహించనున్నట్టు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపాయి. తుంగమడుగులలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి తుంగమడుగుల, వీరవరం, రాయపల్లి, డి.రామవరం, ధాన్యంపాలెం, వేటమామిడి, డి.భీమవరం, దుశ్చర్తి సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు హాజరవ్వాలన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు తిమ్మాపురంలో ఏర్పాటుచేసిన సమావేశానికి అడ్డతీగల–1,2, దొరమామిడి, కోనలోవ, గొండోలు, ఎల్లవరం, తిమ్మాపురం, గొంటువానిపాలెం, కిమ్మూరు సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు విస్తృత స్థాయి సమావేశానికి తరలిరావాలన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


కొత్తవలస పాఠశాలలోని విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

అనంతగిరి: మండలంలోని కొత్తవలస బాలురు పాఠశాల, బాలికల–1 పాఠశాలల్లో అనంతగిరి పీహెచ్‌సీ వైద్యులు జ్ఞానేశ్వరి, ప్రతాప్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


తణుకు వెంకటరామయ్యను సత్కరిస్తున్న సిద్దగిరి పీఠం నిర్వాహకులు సిద్దేశ్వర స్వామి

అడ్డతీగల: ప్రతి ఒక్కరికి పంచ మహాభూతముల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లోని సిద్ధగిరి పీఠంలో మహాభూత లోకోత్సవం నిర్వహించినట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలని, దీంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ సమతుల్యత బాధ్యతగా సమాజం తీసుకోవాలన్నారు.

లోకోత్సవంలో పాలుపంచుకున్నందుకు సిద్ధగిరి పీఠం నిర్వాహకులు స్వామి అదృశ్యకాడ సిద్దేశ్వర పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్యను సత్కరించారు.

అర్హులందరికీ పరిహారం


మాట్లాడుతున్న శ్రీనివాస్

చింతపల్లి: జాతీయ రహదారి నిర్మాణంలో గృహాలు కోల్పోతున్న బాధితులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం అందచేయనున్నట్టు గిరిజన అభివృద్ధి విభాగం ప్రతినిధి శ్రీనివాస్ తెలిపారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వివిధ నిర్మాణాలు కోల్పోతున్న వారితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ భూముల్లో నిర్మాణాలకు పరిహారం అందజేయనున్నట్టు తెలిపారు. బాధిత కుంటుంబాలకు సంబంధించి నివేదికలు తయారుచేశామన్నారు. అర్హులందరికీ పరిహారం అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం


సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

కూనవరం: మండల కేంద్రంలోని శ్రీ వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిగూడెం గ్రామానికి చెందిన భక్తులు లక్ష్మణరావు, అరుణకుమారి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం కమిటీ చైర్మన్ చిలకం హరనాథ్ వారిని కలిసి ఆలయ అభివృద్ధిలో భాగంగా గుడికి మెట్ల, పందిరి ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన లక్ష్మణరావు దంపతులు, ఆయన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆలయానికి మెట్ల పందిరి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ దివంగత మాజీ మండల అధ్యక్షుడు శ్రీమంతుల సీతారామారావు కుమార్తె సంధ్యారాణి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు చిలకం హరనాథ్ తెలిపారు.

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

చింతపల్లి: ఓటరు కార్డులను ఆధార్ నంబర్‌కు అనుసంధానం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ అన్నారు. సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 60,209 మంది ఓటర్లు ఉండగా ఇప్పటి వరకూ 27,081 మందికి ఆధార్ అనుసంధానం చేశామన్నారు. మిగిలిన ఓటర్లకు సకాలంలో అనుసంధానం చేసేందుకు సచివాలయ ఉద్యోగులు చర్యలు వేగవంతం చేయాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ ఎన్‌టీఆర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఉపాధి కల్పనకు కృషి

ఎస్పీ సతీష్‌కుమార్


కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

సీలేరు: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, వారికి ఉపాధి కల్పన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధి ధారకొండలో షేర్–2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో అందిస్తున్న కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటీవల పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన సదరం క్యాంపులో ధ్రువపత్రాలు పొందిన 100 మంది దివ్యాంగులకు రాయితీపై బస్‌పాస్‌లు అందజేశారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమాలను సుమారు 150 మంది గిరి యువతీ యువకులు సద్వినియోగం చేసుకుంటున్నట్టు ఎస్పీ తెలిపారు. సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, జీకే వీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణ, వైద్యులు హిమబిందు పాల్గొన్నారు.

జనజీవన స్రవంతిలో కలవాలి

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి గిరిజనుల అభివృద్ధికి సహకరించాలని ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడారు.ఏజెన్సీ మారుమూల ప్రాంతాలు సైతం ప్రభుత్వ పథకాలు, పోలీసుశాఖ చేపడుతున్న కార్యక్రమాల ద్వారా అభివృద్ధి చెందుతున్నాయని ఆయన అన్నారు.

వాహన తనిఖీలు


వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రంజిత్‌కుమార్

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని ఎస్ఐ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, వాహన పత్రలు సక్రమంగా లేని వాహనచోదకులకు జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా సీతారాముల తీర్థం

కె.కోటపాడు: పిండ్రంగిలో సీతారాముల తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సీతారాముల ఆలయంలో గ్రామస్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థం సందర్భంగా బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడిగా మారింది. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


యండపల్లివలసలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


కొయ్యూరులో ప్రచారంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

అరకులోయ రూరల్: పట్టభద్రల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపునిచ్చారు. అరకులోయ పట్టణంలోని సీ–కాలనీ, బీ–కాలనీ, యండపల్లివలస ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ ఉషారాణి, మండల మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాసిన్, కన్వీనర్ పట్టాసి సంపత్ కుమార్, నాయకులు సాంబ, నర్సింగ్, సోమేష్, మోటార్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. మండల కేంద్రంలో జరిగిన ప్రచారంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ కన్వీనర్ సుధాకర్, డైరెక్టర్ అచ్యుత్ తదితరులు శుక్రవారం పాల్గొన్నారు. పాఠశాలల్లో పర్యటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత


బాధితులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న అల్లూరి యువ గిరిజన సేవా సంస్థ సభ్యులు

కొయ్యూరు: మండలంలోని తాటిమానిపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు వివిధ స్వచ్ఛంద సంస్థలు చేయూత అందిస్తున్నాయి. ఇందులో భాగంగా అల్లూరి యువ గిరిజన సేవా సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో బాధితులైన ఏడు కుటుంబాలకు దుస్తులు అందజేశారు. ఒక్కో కుటుంబానికి 20 కిలోల చొప్పున బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మల్లేష్, హరిదేవ్, యువరాజ్, తిరుపతి, దావీదు, సర్పంచ్ చంద్రరావు తదితరులున్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో

ఉపాధ్యాయుడు జలుమూరి వెంకట గిరిబాబు, ఎఫ్ఎఫ్‌వో భాగ్యలక్ష్మి దంపతులు అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్యాత్మిక సంస్థ తరపున నిత్యావసరాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ తాను ఎమ్మార్పీగా పనిచేసినప్పుడు తాటిమానిపాలెం గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యవేణి, సీఆర్‌పీ సీతారామ్ పాల్గొన్నారు.

లోకుల గాంధీ ట్రస్టు

దివంగత నేత లోకులగాంధీ ట్రస్టు తోడు ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులను శుక్రవారం అందజేశారు. ట్రస్టు ప్రతినిధి మురళీకృష్ణ మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. బీజేపీ ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు చంద్రరావు, అర్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరసపల్లిలో పశు వైద్య శిబిరం


సిరసపల్లిలో పశువులకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

పెదబయలు: మండలంలోని గలగండ పంచాయతీ పరిధిలోని సిరసపల్లి గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. 60 పశువులు, 85 గొర్రెలు, మేకలకు వైద్యం అందించినట్టు పశువైద్య కేంద్రం లైవ్ స్టాక్ అధికారి వరలక్ష్మి తెలిపారు. గ్రామంలో లంపీ స్కిన్ వ్యాధి లక్షణాలు ఉన్న ఐదు పశువులకు టీకాలు అందించామన్నారు. వీటితో పాటు గ్రామంలో 60 పశువులకు టీకాలు, గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందు ఇచ్చినట్టు తెలిపారు. అనారోగ్యంతో ఉన్న పశువులకు యాంటీబయోటిక్స్ ఇంజక్షన్లు వేశామన్నారు. పశువులకు అత్యవసర చికిత్స అందించే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉందన్నారు. అత్యవసర సేవల కోసం 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సేవలు పొందవచ్చన్నారు. పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. లంపీ స్కిన్ వ్యాధి సోకిన పశువులకు మందకు దూరంగా ఉంచాలని వ్యాధి ప్రభావం తగ్గేంత వరకు మంచి మేత పెట్టాలని సూచించారు. గ్రామ సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ వరిబొందు, బలరాం, పాడి రైతులు బొజ్జయ్య, వెంకట్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి


కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

చింతూరు: పోలవరం నిర్వాసితులకు పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ భూమికి స్థలం ఇవ్వాలని, 41.15 కాంటూర్‌లో చేర్చాల్సిన గ్రామాల జాబితాను తక్షణమే ప్రకటించాలి డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చింతూరు ఐటీడీఏ ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను సీపీఎం నేతలు కలిసి, గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, వరద బాధితులకు పరిహారం అందజేయాలని, రోడ్ల పనులు చేపట్టాలని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. సత్యనారాయణ, వెంకట్ నాగేశ్వరరావు, సురేష్, సీతారామయ్య, కొమరం తదితరులు పాల్గొన్నారు.

టమాటాకు గిట్టుబాటు ధర కరువు


వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్న రైతులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలు వారపు సంతలో శుక్రవారం టమాటాకు గిట్టుబాటు ధర కరువైంది. దిగుబడి ఎక్కువ రావడంతో సంతకు అధిక మొత్తంలో టమాటా తీసుకొచ్చామని, మైదాన ప్రాంత వ్యాపారులు సిండికేట్‌గా కొనుగోలు చేయడంతో సరైన ధర లభించలేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 40 కిలోల కావడి టమాటా రూ.250 నుంచి రూ.300 వరకు కొనుగోలు జరిగిందని, మధ్యాహ్నం నుంచి కేవలం రూ.150 నుంచి రూ.200లకు ధర పడిపోయిందని, కనీసం రవాణా చార్జీలు కూడా రాలేదని వాపోయారు.

పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. రోజంతా వారపు సంతలో పడిగాపులు కాసినా టమాటా కొనుగోలు వ్యాపారులు రావడం లేదన్నారు. గత్యంతరం లేక చాలా తక్కువ ధరకు టమాటా విక్రయించి తిరుగుముఖం పట్టాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.